హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.0

నిరుపేదల ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా అర్హులైన వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ప్రజాపాలన' కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల అమలుతోపాటు ఇందిరమ్మ ఇంటికోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తుల ప్రకారం అర్హులను గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తుండగా, జిల్లాలో సర్వే నెమ్మదిగా సాగుతోంది. సర్వేకు ఈ నెలాఖరు వరకు గడువు విధించగా, ఇప్పటి వరకు కేవలం 40శాతమే పూర్తయింది.

– (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట(కలెక్టరేట్)



కొనసా...గుతున్న సర్వే

- జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3.09లక్షల దరఖాస్తులు
- పట్టణ ప్రాంతాల్లో 2.50లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 58వేలు
- నియోజకవర్గానికి 3,500 ఇళ్ల కేటాయింపు
- ఇప్పటి వరకు 40శాతం సర్వే మాత్రమే పూర్తి
- ఈ నెలాఖరు వరకు గడువు విధించిన ప్రభుత్వం

'ప్రజాపాలన' కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు తీసుకున్న ప్రభుత్వం నూతన సంవత్సరంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంది. ఇందిరమ్మ ఇళ్లలో తొలి విడతలో ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. అందుకోసం 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులతో సర్వే చేయిస్తోంది. ఈ సర్వే ప్రకారం అర్హులను గుర్తించనున్నారు.

3,09,062 దరఖాస్తులు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 'ప్రజాపాలన' కార్యక్రమంలో 3,09,062 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో పట్టణ ప్రాంతాల్లో 2,50,684 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 58,378 మంది దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు నివసిస్తున్న ఇంటి వివరాలు సేకరిస్తున్నారు. వారు నివసించే ఇంటి లోపల, బయట, ఇంట్లోని వస్తువులను ఫొటో తీస్తున్నారు. తద్వారా దరఖాస్తుదారుల ఆర్థిక స్థితిగతులను నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలను ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో అయితే వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతీ 500 దరఖాస్తులను ఒక సర్వేయర్..

- మిగతా 8వ పేజీలో...

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసుకున్న దరఖాస్తుల సర్వే అనంతరం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇంటిని మంజూరు చేయనుంది. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అంతేగాక ఇంటి స్థలం ఉండి ఇంటిని నిర్మించుకునే వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనుంది. దీంతో ప్రభుత్వంపై కొంతమేర ఆర్థిక భారం తప్పనుంది. లేదంటే ఇంటి స్థలాలు సేకరించి, దాన్ని లేఅవుట్‌గా మార్చి లబ్ధిదారులకు కేటాయించి, ఇంటిని నిర్మించి ఇవ్వాలంటే సమయంపట్టేది. అదే ఇంటి స్థలం ఉన్న అర్హులకు ఇందిరమ్మ ఇంటిని కేటాయిస్తే కేవలం ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే సరిపోతుంది.





బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

- జిల్లా అధ్యక్షుల ప్రకటనతోనే సరి
- కార్యవర్గంతో పాటు అనుబంధ కమిటీలు నియమించని వైనం
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పూర్తిస్థాయి కమిటీలు ఏర్పడేనా?

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అయితే ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా పార్టీ సంస్థాగత ఎన్నికలపై అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

– (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

టీఆర్ఎస్‌గా ఉన్నప్పుడు 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు పదవులు కేటాయిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండేది. జిల్లా కమిటీలు బలోపేతంపై నిరంతరం అధ్యయనం చేసేది. అయితే అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అధికారాలు బదలాయించి, ఇప్పటివరకు సంస్థాగతంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయలేదు. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయి ఏడాది గడిచింది. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేసే దిశగా పార్టీ అడుగులు వేస్తోంది.

జిల్లా అధ్యక్షులతోనే సరి

టీఆర్ఎస్‌ను భారతీయ రాష్ట్ర సమితీ (బీఆర్ఎస్)గా మారుస్తూ, జాతీయ రాజకీయాల్లోకి పార్టీ అరగేంట్రం చేసింది. జాతీయ పార్టీగా ఆవిర్భవించిన అనంతరం సంస్థాగత పదవులపై బీఆర్ఎస్ నేతల్లో ఆశలు రేకెత్తాయి. 2022 జనవరి 26న అధిష్ఠానం 33 జిల్లాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా దేవేరకొండ నాటి ఎమ్మెల్యే రవీంద్రనాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా నాటి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను అధిష్ఠానం పార్టీ నియమించింది.

అయితే జిల్లా అధ్యక్షులకే పరిమితం చేసిన అధిష్ఠానం జిల్లా, పార్టీ అనుబంధ సంఘాలకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించలేదు. మూడేళ్లుగా సంస్థాగత పదవుల కోసం పార్టీ నాయకులు ఎదురుచూస్తున్నారు.

పునరుద్ధరణకు నోచుకోని కమిటీలు

జిల్లాల్లో అన్ని రాజకీయ పార్టీలకు సంస్థాగతంగా కమిటీలు ఉన్నాయి. ఏడేళ్ల క్రితం టీఆర్ఎస్ అధిష్ఠానం జిల్లా కమిటీలను రద్దు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులకు పార్టీ వ్యవహారాలను అప్పగించింది. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా తీసుకునే కీలక నిర్ణయాలపై సర్వ అధికారాలు స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలకు అప్పగించింది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో పొసగని పలువురు సీనియర్ నేతలు కొంతకాలంగా రాజకీయపరంగా నిశ్శబ్దంగా ఉన్నారు. జిల్లాలో నియోజకవర్గాల్లో నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ, పార్టీలోనే కొనసాగుతున్నారు. మరోవైపు స్థానికంగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలకు రాజకీయంగా తీసుకునే నిర్ణయాల్లో అవకాశం కల్పించకపోవడంతో, వారు ఎదగలేకపోయారని అధిష్ఠానం గ్రహించింది. పార్టీలో సంస్థాగతంగా ఉన్న విభేదాలు సమసిపోవాలంటే పార్టీని జిల్లా కమిటీలకే అప్పగించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో...

- మిగతా 7వ పేజీలో...

రాష్ట్రస్థాయిలోనూ పాత కార్యవర్గమే

పార్టీ అధిష్ఠానం 2017లో అప్పటి టీఆర్ఎస్ మహాసభల్లో ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గమే నేటికీ కొనసాగుతోంది. పార్టీ బీఆర్ఎస్‌గా మారినా రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటుచేయలేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నూతన కార్యవర్గాల ఏర్పాటుపై పార్టీ నేతల్లో జోరుగా చర్చ జరుగుతోం ది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం సంస్థాగతంగా నూతన కమిటీలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. బీఆర్ఎస్ 2021 సెప్టెంబరు 2 నుంచి సంస్థాగత ఎన్నికలు నిర్వహించింది. సెప్టెంబరు 2 నుం చి 12వ తేదీ వరకు 15మంది సభ్యులతో గ్రామస్థాయిలో ప్రధా న కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రతీ గ్రామంలో విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక, తదితర 14 అనుబంధ సంఘాలను నియమించింది. 13 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసింది. 2022 జనవరి 26న ముఖ్యమంత్రి పార్టీ జిల్లా అధ్యక్షులను ప్రకటించారు. అయితే నాటి నుంచి ఇప్పటివరకు కార్యవర్గాలను, పార్టీ అనుబంధ కమిటీలను నియమించలేదు. ప్రస్తుతం స్థానిక సంస్థలు వస్తున్న నేపథ్యంలో పార్టీ సంస్థాగతంగా పదవులను భర్తీ చేసే ఆలోచనలో ఉన్నట్టు స్థానికంగా నేతల్లో జోరుగా చర్చ సాగుతోంది.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి ఎనలేని కృషి చేశారని అదనపు కలెక్టర్ పీ రాంబాబు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గడ్డం వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలం ఎంపీగా, కేంద్ర మంత్రిగా వ్యవహరించారని కొనియాడారు. వెంకటస్వామి సేవలను స్మరించుకునేందుకు ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సుదర్శన్‌రెడ్డి, టీఎన్‌జీవో నాయకులు దున్న శ్యామ్ పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, ఆర్ఎస్ఐలు సురేష్, అన్వర్, సాయిరాం, సీసీలు సందీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

క్రీడలతో మానసికోల్లాసం

భానుపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని అదనపు కలెక్టర్ పీ రాంబాబు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీఎం కప్ వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, అవకాశాలు లేక వారి ప్రతిభ ప్రపంచానికి తెలియడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతా క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి వారిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టును ఎంపిక చేస్తారన్నారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో రామచంద్రారావు, హెచ్‌డీఎఫ్ కార్యదర్శి అజాంబాబా, జిల్లా అధ్యక్షుడు పగిడి మల్లేష్, కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ విశ్వచారి, టీజీపీ ఈటీఏ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కార్యదర్శి సీతారాంరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, ఏడుకొండలు, మైసయ్య, రవి, కార్యాలయ సిబ్బంది రవితేజరెడ్డి, యాదయ్య తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పిల్లలు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామెర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపి, మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 13 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం కనీసం వారితో మాట్లాడే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సుమారు 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తుంటే రెగ్యులర్ చేయకపోవడం సమంజసంకాదన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, సుజాత, మాధవి, సురేష్, ఉపేందర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్, మంగమ్మ, రజిత, సునీత, నాగమణి, రాజేష్, అనురాధ, శ్రీలత, ప్రసాద్, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి



మోతె మండలం రావిపహడ్‌లో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం నిలిపివేయాలని బుర్కచర్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అఖిలపక్షం నాయకులు

మోతె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, పంటలకు ప్రమాదకరంగా మారే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. మండలంలోని రావిపహడ్‌లో నిర్మిస్తున్న ఎన్ఎమ్‌కే ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని కోరుతు బుర్కచర్ల గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి, మాట్లాడారు. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే చుట్టుప్రక్కల 10 గ్రామాల్లో పంటలు పండకపోవడం, భూగర్భజలాలు విషంగా మారి కాలుష్యంతో పల్లెలు నిండిపోతాయన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకుల అండదండలతో నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అనుమతులు ఇచ్చిన వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు జంపాల స్వరాజ్యం, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, కొండా లక్ష్మణ్, భాస్కర్, కునుకుంట్ల సైదులు, నల్లడ మాధవరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముందుకు పోతది అనుకుంటే వెనక్కిపోతోంది



సెమిక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి మార్పుతో ముందుకు పోతది అని ప్రజలు నమ్మితే వెనక్కి పోతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓఫంక్షన్‌హాల్‌లో క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రైస్తవులకు ఏర్పాటుచేసిన ప్రేమ విందు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వమతాలకు ప్రాధాన్యమిస్తూ గతంలో కేసీఆర్ రంజాన్, క్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాక ముందే దుస్తులు మాయమయ్యాయని ఆరోపించారు. వచ్చే ఏడాది వరకు ఇంకేం ఉంటాయో, పోతాయో తెలియని పరిస్థితి కనిపిస్తోందన్నారు. పండుగల వేళ రాజకీయాలు మాట్లాడటం అలవాటు లేదని, కానీ ప్రజల కోసం మాట్లాడక తప్పడంలేదన్నారు. ప్రస్తుతం పండుగలను మరిచిపోయేలా కాంగ్రెస్ పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్‌కుమార్, ఆర్డీవో వేణుమాధవ్, జిల్లా మైనార్టీ శాఖ అధికారి జగదీశ్‌రెడ్డి, దుర్గం ప్రభాకర్, వరికుప్పల మత్తయ్య, డానియేలు, గాబ్రియేలు, జెమ్స్, బాలాజీనాయక్, సజీవ, ఇరుగు శ్యాంసన్, లాజర్, రూబెన్, బాబురావు, మార్క్, క్రిస్టోఫర్, అబ్రహం పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణ

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని భూనీల సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన భక్తులు

ఎస్సారెస్పీకి నీటిని విడుదల చేయాలి



నాగారం మండల కేంద్రంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

నాగారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ రెండోదశకు నీటిని వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాగారం మండలకేంద్రంలో సీపీఎం మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశకు నీటి విడుదల కోసం రైతులు నిరీక్షిస్తున్నారని అన్నారు. రైతులు యాసంగి సీజన్‌కు నార్లు పోసుకుని నీటి విడుదలకు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత రైతులకు తాగు, సాగు నీటిని విడుదల చేయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, నాల్గో విడత రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలో నేటికీ జమ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాన్ని మాఫి చేయాలన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేసేలా ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు 24 గంటలు వైద్యసేవలు అందేలా వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం, హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, గూడపూరి వెంకటేశ్వర్లు, మొల్కాపురి మహేందర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుద్దీపాల అలంకరణలో మఠంపల్లిలోని శుభవార్త దేవాలయం

- ప్రత్యేక అలంకరణలో చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- మఠంపల్లిలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

క్రిస్మస్ పర్వదిన వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచర్చిలు ముస్తాబయ్యాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పలు చర్చిలు వేడుకలకు ముస్తాబుచేశారు.




మఠంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ తెలంగాణలోనే అతి పెద్ద చర్చిగా పేరొందిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే మహోత్సవాలకు దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పరవళ్లు తొక్కే కృష్ణానదీ తీరాన వెలసిన శుభవార్త దేవాలయం మరియమాత దీవెనలతో విరాజిల్లుతోంది. ఇక్కడ కులాలకు, మతాలకు అతీతంగా ప్రార్థనలు చేస్తూ మరియమాత దీవెనలు పొందుతుంటారు. ఈ లోకానికి రక్షకుడిని అందించిన తల్లిగా భక్తుల బాధలను, వ్యాధులను, ఇతర సమస్యలను తన కుమారుడిని ప్రార్థించే వారి అవసరాలు తీర్చే తల్లిలా ఆమె ప్రసిద్ధి. శుభవార్త దేవాలయం(మంగళవార్త చర్చి) 1968లో నిర్మించారు. అనంతరం పునర్నిర్మాణంలో భాగంగా 1980లో శంకుస్థాపన చేయగా 1993వ పూర్తి చేశారు. అప్పటివరుకు మంగళవార్త చర్చిగా పిలవబడుతున్న దేవాలయానికి శుభవార్త దేవాలయంగా నామకరణం చేశారు. వేడుకలకు గ్రామానికి చెందిన క్రైస్తవ కుటుంబీకులతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లోని బంధువులు హాజరవుతుంటారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకల వివరాలను విచారణ గురువు మార్టిన్ పసల శుక్రవారం ప్రకటించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు, క్రైస్తవ భక్తులను ఉద్దేశించి ప్రసంగం, పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 25న జరిగే శుభవార్త చర్చి జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న ప్రముఖులు, గురువులు, బిషప్‌లతో పాటు విదేశాల్లోని క్రైస్తవులు కూడా హాజరై ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మర్రిగూడ మండలంలో

మర్రిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల ఆరాధ్య దైవమైన ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలకు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. కమ్మగూడెం గ్రామంలో పునీత జోజప్ప మందిరాన్ని నిర్మించి సుమారు 50 ఏళ్ల పూర్తయ్యాయి. ఈ చర్చిని అప్పటి ఫాదర్ కాశీరాం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇక్కడ క్రైసవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. పూర్వీకులు నిర్మించిన ఈ మందిరాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రిస్మస్ సందర్భంగా వేడుకలను నిర్వహించుకుంటారు. అదేవిధంగా ఎబినేజర్ ప్రార్థన మందిరంలో మౌంట్ సినాయి సువార్త సంఘం, శాలోమ్ పలు మందిరాలను క్రైస్తవ సోదరులు ముస్తాబు చేశారు. ఇప్పటికే పలు చర్చిల్లో సెమీక్రిస్మస్ సంబురాలు, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలతో చర్చిల ఆవరణలు ఆహ్లాదకరంగా మారాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్నారు.



చర్చిలోపల అలంకరణ



మర్రిగూడ మండలం కమ్మగూడెంలో 100 అడుగుల ఎత్తులో నిర్మించిన గోపురాలతో చర్చి ప్రాంగణం

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు
జిల్లా బాలికల జట్టు



ఆలేరు నుంచి వెళ్తున్న కబడ్డీ జిల్లా జట్టు క్రీడాకారులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా బాలిక జట్టు ఆదివారం బయలుదేరింది. ఈ నెల 22 నుంచి 25 వరకు హకీంపేట బాలికల గురుకుల క్రీడామైదానంలో పోటీలు జరుగుతున్నట్లు క్రీడాకారులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా జట్టును ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యయులు, పలువురు అభినందించారు. కబడ్డీలో రాష్ట్రస్థాయి ప్రథమ విజేతలుగా నిలవాలని ఆశీర్వదించారు. అనంతరం జట్టు క్రీడాకారులను ఆర్టీసీ బస్సులో తీసుకెళ్లారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాదాసు జోసఫ్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ కోశాధికారి గంధమల్ల కుమార్, సహాయ కార్యదర్శులు పూల చంద్ర కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం



ప్రథమ విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న గ్రామ యువకులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ఆలేరు మండలం గుండ్లగూడెం జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. క్రీడాకారులను గ్రామానికి చెందిన యువకులు అభినందించారు. పోటీల్లో విజేత నిలిచిన జట్టు నుంచి ఆరుగురు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికచేశారు. వారిలో పీ రాజేష్, కే రాజు, వెంకటేష్, దినేస్, వీరేందర్ ఉన్నారు.

న్యాయమూర్తి తులాభారం



యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం సమీపంలోని స్వర్ణగిరి ఆలయాన్ని భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం ఉషశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. స్వామి వారి దర్శన అనంతరం తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ఏం చేస్తాం.. తాళం చెవి పోయింది





యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం పరిధి రాయగిరిలో ఆదివారం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల వాహనం తాళం చెవి ఎక్కడో పోయింది. చుట్టుపక్కలా వెతికినా కనిపించకపోవడంతో మరో వాహనంతో ఆ వాహనాన్ని తీసుకెళ్లారు. ప్రజలు దీనిని ఆసక్తిగా తిలకించారు.

వీల్‌చైర్ క్రికెట్‌లో ప్రతిభ చాటిన సురేష్



ఫైనల్ ట్రోఫీతో ధరావత్ సురేష్

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండాకు చెందిన సురేష్ మరోసారి తనప్రతిభను చాటాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో ఉమాంగ్ గౌరవదీప్ నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నీలో శారీరకంగా వైకల్యం ఉన్నప్పటికీ సురేష్ పలు మ్యాచ్‌లో ప్రతిభను కనబరిచాడు. ఫైనల్ మ్యాచ్ తెలంగాణ, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల మధ్య జరగ్గా తెలంగాణ రాష్ట జట్టు ఘన విజయం సాధించింది. కీలకమైన ఆరు వికెట్లను తీయడంతో పాటు మంచి పరుగులు సాధించి ఆల్‌రౌండ్ ప్రతిభను చాటాడు. ఈ సందర్భంగా సురేష్‌ను తండావాసులు అభినందించారు.

కాలినడక భక్తులకు నేరుగా దర్శనం



సమావేశంలో కరపత్రాలను చూపిస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నాయకులు

నల్లగొండ, కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు కాలినడకన వెళ్లే భక్తులకు క్యూలో నిలబడకుండా నేరుగా అయ్యప్పస్వామి దర్శనం చేసుకునే సౌకర్యాన్ని కేరళ ప్రభుత్వం కల్పించిందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కేంద్ర కమిటీ అధ్యక్షుడు రాజు దేశ్పాండే, ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదయ్య, ప్రచార కార్యదర్శి సోము, పూల గురుస్వామి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని అయ్యప్ప సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని 2022 ఏప్రిల్‌లో కేంద్ర కమిటీ ద్వారా కేరళ సీఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు. అందుకు స్పందనగానే ఈ ఏడాది అమలుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా శబరిమలకు వెళ్లే అయ్యప్పమాలధారణ స్వాములకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా పిల్లలకు, స్త్రీలకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి వారి దర్శనానికి దేవస్థానం బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. సమావేశంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పుట్టబోతుల కృష్ణమూర్తి, కందగట్ల విఠల్, కోట శ్రీనివాస్, బిక్షమయ్య, నిఖిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడిగా మార్చిన సినిమా

యాదాద్రిభువనగిరి చౌటుప్పల్‌లో ప్రదర్శించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమా ఓ సామాన్యుడిని అయ్యప్ప దీక్షాపరుడిగా మార్చింది. అదే భక్తుడికి వచ్చిన ఒక కల దేవాలయ నిర్మాణానికి కారణమైంది. ఇప్పుడా భక్తుడు ప్రసిద్ధ గురుస్వామిగా 35వ సారి మాలధారణతో శబరిమలై యాత్రకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో 35 ఏళ్లలో వేలాది మంది భక్తులకు మాలధారణ చేయిస్తున్నాడు. భక్తులకు ఆయన చేసిన సేవలకు గాను అనేక పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అయ్యప్పస్వాములు, భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న చౌటుప్పల్ పట్టణానికి చెందిన బొబ్బిళ్ల మురళిగురుస్వామి 35 ఏళ్ల ప్రస్థానం ఇది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

- సామాన్యుడి నుంచి ప్రతిభావంతమైన గురుస్వామిగా..
- అయ్యప్ప ఉపదేశాన్ని నిజం చేస్తూ దేవాలయ నిర్మాణం
- అయ్యప్ప సేవలో అనేక పురస్కారాలు
- తెలుగు రాష్ట్రాల్లోని భక్తులకు స్ఫూర్తి మురళీగురుస్వామి



బొబ్బిళ్ల మురళి గురుస్వామి



మురళి అయ్యప్పస్వామి దేవాలయం

చౌటుప్పల్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిళ్ల మురళి 1989లో శరత్‌బాబు నటించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమాను స్థానిక థియేటర్‌లో చూసి భక్తి మార్గం వైపు ప్రేరణ పొందారు. అదే సంవత్సరం నవంబరు 25న అయ్యప్పమాల వేసుకొని 41 రోజుల దీక్షను చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు మురళి మాలధారణతో దీక్షను నిర్వహిస్తూ గురుస్వామిగా అందరి ప్రశంసలను అందుకుంటున్నారు. మాలధారణతో దీక్షలను నిర్వహిస్తున్న 9ఏళ్ల తరువాత మురళికి అయ్యప్పస్వామి కలలోకి వచ్చి తనకు ఈ ప్రాంతంలో గుడి కట్టించాలని ఉపదేశించారట. ఆ ఉపదేశాన్ని నిజం చేస్తూ పట్టణంలోని ఊర చెరువు ఒడ్డున 1998 జూన్‌లో ఒక చిన్న రేకుల షెడ్డును వేయించి అందులో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు ప్రారంభించాడు. ఈ గుడిలో పూజలు చేసేందుకు అయ్యప్పమాలధారులతో పాటు భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగింది. దీంతో ఆ చెరువు పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి నామస్మరణతో మారుమోగేవి. దేవాలయానికి ప్రాముఖ్యం పెరగడంతో ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు, సాధువులు విచ్చేసి భక్తులకు ఉపదేశాలు, ప్రవచనాలు ఇచ్చేవారు.

2001 నుంచి అన్నదానం

మురళి గురుస్వామి ప్రవేశపెట్టిన 2001 నుంచి అయ్యప్పదీక్షల సందర్భంగా ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రతీ ఏడాది నవంబరు 16 నుంచి జనవరి 12 వరకు ఈఅన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈదేవాలయ సన్నిధానంలో 500నుంచి 600మందివరకు అయ్యప్ప స్వామి దీక్షాదారులు ఆశ్రయం పొందుతారు. ఈదేవాలయంలో స్వాములకు అన్నదానం చేసేందుకు భక్తులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

మాంసాహారాన్ని త్యజించిన మురళి

మొదటి మాలాధారణ చేసిన 1989 సంవత్సరం నుంచి మురళి మాంసాహారాన్ని త్యజించారు. చిన్నప్పటి నుంచే మద్యపానం అలవాటు లేదు. శబరిమలైకు వెళ్లిన 34 పర్యాయాల్లో 30 సార్లు పెద్ద పాదం (60 కిలోమీటర్లకు పైగా) నుంచి వెళ్లి జ్యోతి దర్శనం చేసుకున్నారు. 2020లో ప్రబలిన కరోనా సమయం నుంచి చిన్నపాదం(7 కిలోమీటర్లు నడిచి) నుంచి నాలుగు సార్లు జ్యోతి దర్శనం చేసుకున్నారు. మాల ధారణ చేసుకున్నటి నుంచి 34సార్లు జ్యోతి దర్శనం చేసుకోవడం విశేషం.

2012లో దేవాలయానికి భూమిపూజ

మురళి తీసుకున్న ప్రత్యేక చొరవతో చిన్న రేకుల షెడ్‌లో ఉన్న అయ్యప్పస్వామికి పెద్ద దేవాలయం నిర్మాణం చేసేందుకు 2012లో శ్రీసిద్దేశ్వర భారతీస్వామి భూమి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో రూ.1.62 కోట్లను వెచ్చించి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా దేవాలయాన్ని నిర్మించారు. 2015 మే 31 నుంచి జూన్ 4 వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో అయ్యప్పస్వామితో పాటు వినాయకుడు, పరమేశ్వరీదేవి, సుబ్రమణ్యస్వామిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దేవాలయ నిర్మాణంలో మురళి గురుస్వామి నిర్వహించిన పాత్రను అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ దేవాలయానికి మురళి గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అనేక పురస్కారాలు

ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో మురళి గురుస్వామి చేసిన సేవలకు అనేక పురస్కారాలను అందుకున్నారు. అందులో ప్రధానంగా మూడుసార్లు ఉత్తమ గురుస్వామిగా పురస్కారాలను అందుకున్నారు. అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచార సభనుంచి 2021-22కు అయ్యప్ప పురస్కారాన్ని పొందారు. 2021లో ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో మహాశాస్తా సేవా ట్రస్ట్ ఉత్తమ గురుస్వామి అవార్డులు అందుకున్నారు.

కఠిన దీక్షతోనే మనోభీష్టం నెరవేరుతుంది



35 ఏళ్లుగా అయ్యప్పస్వామి మాలాధారణతో కఠినమైన దీక్షలను పాటిస్తున్నా, ప్రతి ఒక్కస్వామి కూడా మాలాధారణతో పాటు ఇరుముడిని గురువులతోనే వేయించుకోవాలి. దీక్షలు పాటించే స్వాములు తప్పనిసరిగా సమూహంగా సన్నిధానంలో ఉండాలి. సహపంక్తి భోజనాలు చేయాలి. 41 రోజులు విధిగా దీక్షలను నిర్వహించాలి. దీక్షలలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తేనే భక్తుల మనోభీష్టం నెరవేరుతుంది. దీక్షా సమయాలతో పాటు 365 రోజులు కూడా నిష్ఠగా ఉండడం అలవాటు చేసుకుంటే అన్నివిధాలా శ్రేయస్కరం.

- బొబ్బిళ్ల మురళి గురుస్వామి, చౌటుప్పల్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



లింగం(ఫైల్)

నాంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని కేతేపల్లి ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం కొత్తబాయి గ్రామానికి చెందిన పిల్లి రామలింగం(28) సెంటింగ్ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఆయనకు భార్య అనూషతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం నాంపల్లి మండలంలోని దామెర గ్రామంలో జరిగిన శుభ కార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కేతేపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం తరలిస్తుండగా లింగం కుటుంబసభ్యులు కొద్దిసేపు అడ్డుకున్నారు. న్యాయం చేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దేవరకొండ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. లింగం తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మేళ్లచెర్వు మండలం గానుగబండకు చెందిన ఇద్దరు మైనర్లు మేళ్లచెర్వు నుంచి హుజూర్‌నగర్‌కు ఆదివారం కారులో వస్తున్నారు. వేపలసింగారంలోని మిట్టగూడెం మూలమలుపు వద్ద అతివేగంగా రావడంతో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మైనర్లకు గాయాలయ్యాయి. కాగా కారు నడుపుతున్న యువకులు వెంటనే కారును అక్కడి నుంచి తీసుకవెళ్లారు. కాగా ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

30 టన్నుల నల్లబెల్లం స్వాధీనం



పట్టుకున్న నల్లబెల్లం లారీ, నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

తుంగతుర్తి / తిరుమలగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎంహెచ్ 26 సీహెచ్ 0075 నెంబలర్ గల లారీలో అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల నల్లబెల్లం, క్వింటా పటిక, 20లీటర్ల నాటుసారా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లారీలో ఉన్న గంగారామ్‌ను అరెస్టు చేశామని మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య, ఎక్సైజ్ ఎస్‌ఐ మూర్తి, రామకృష్ణ, సిబ్బంది ఆంజనేయులు, కొండల్, శ్రీకాంత్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్: కేసు నమోదు

కనగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీని ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా చొల్లూరు ఇసుక రీచ్ నుంచి అంబర్‌పేటకు ఇసుకరవాణా అనుమతులు పొంది నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి రవాణా చేస్తుండగా ఆదివారం ఉదయం కనగల్‌లో పోలీసులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ కరుణాకర్, ఓనర్ సైదులుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	577
టీఎంసీలు	274.3640
ఎడమకాల్వకు నీటి విడుదల	8022
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,252 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	17,808 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.03 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
టీఎంసీలు	4.20
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	15.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	325 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ లేదా?



దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

- రోడ్డుపై కన్పించని స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పాయింట్లు
- దర్గా ఉర్సు వద్ద జనంపై దూసుకెళ్లిన డీసీఎం
- ముగ్గురు అమాయకుల మృత్యువాత
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

దేవరకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వాహనాల అతివేగం, స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పా యింట్లు లేకపోవడం కారణంగా తెలుస్తోంది. ప్రమాదా లు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని వెళుతున్నారే తప్ప నివారణ చర్య లు చేపట్టకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో 24గంటల వ్యవధిలోనే అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గా నలుగురు మృతిచెందారు. ఈ నెల 21న ఉదయం 6.30 గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణ శివారు జడ్చర్ల- కోదాడ రహదారిపై హజ్రత్ ఖాదర్‌షా వలి దర్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు.

డీసీ ఎం దూసుకెళ్లడంతో కొబ్బరికాయలు విక్రయిస్తున్న తాటికోలుకు చెందిన ఎండీ. హాజి మియా, నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూర్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్, హైదరాబాద్‌కు చెందిన నబినాబేగం మృతిచెందారు. ఈ నెల 20వ తేదీన దేవరకొండ మండలం తూర్పుపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కల్వకుర్తివైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో అంకూరి ఎల్లమ్మ(55) అక్కడి కక్కడే మృతిచెందింది.

మృతుల కుటుంబాలది తీరని వేదన

దీంతో ఆ కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి. దేవరకొండ మండలం తాటికోలుకు చెందిన ఎండీ. హాజిమియా జాతర్లు, ఉర్సు ఉత్సవాల్లో కొబ్బరికాయలు, దేవుడి పూజ సామాగ్రి, తినుబండరాలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య జాహంగీర్‌బితోపాటు ముగ్గురు ఆడబిడ్డలు ఉన్నారు. ఆడపిల్లల వివాహ లయ్యాయి. కుటుంబానికి పెద్దదిక్కైన హాజిమియా మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూరుకు చెందిన అబ్దుల్ ఖాదర్(19) అన్వర్‌పాషకు ఒక్కగానొక్క కొడుకు. రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ ఖాదర్ మృతిచెందగా, అన్వర్‌పాష కాలు విరిగింది. ఉర్సు ఉత్సవాలకు వచ్చి ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చిన హైదరాబాద్ చంపాపేటకు చెందిన నబినాబేగం(25) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. తల్లి కేమైందని ఆమె ఇద్దరు చిన్నారులు అడుగుతుండడం అక్కడున్న వారు కంటతడి పెట్టారు. నబినాబేగం మృతి చెందడంతో భర్త ఖాదర్‌పాష కన్నీటి పర్యంతమవుతున్నాడు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడమే పెద్ద దర్గా వద్ద ప్రమాదం జరగడానికి కారణమని బాధితుల బంధువులు తెలిపారు. దర్గా వద్ద స్పీడు బ్రేకర్లతోపాటు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దేవరకొండ మండలం కొండభీమనపల్లి, దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ఆర్చి వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి భీముడు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కల్వకుర్తి నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. మూడు నెలల క్రితం కొండభీమనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగయ్య అనే రైతు మృతిచెందాడు. అతివేగాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకొని స్పీడు బ్రేకర్లు, ప్రమాదాల హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


స్పీడు బ్రేకర్లు ఉంటే ప్రమాదం జరిగేది కాదు



దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు ఉంటే రోడ్డు ప్రమాదం జరిగి ఉండేది కాదు. స్పీడు బ్రేకరు లేకపోవడంతోనే డీసీఎం డ్రైవర్ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేసి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- దస్తగిరి, ఎర్రారం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. తరుచూ తనిఖీలు చేస్తున్నాం. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తాం. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన వారిపై చర్యలు చేపడతాం.

- నర్సింహులు, దేవరకొండ సీఐ.

నాయకుల నోట గండమల్ల మాట

- గండమల్లపై అసెంబ్లీలో చర్చ
- ఆలేరు ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు



గండమల్ల చెరువు

తుర్కపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఆలేరు ప్రజలు సాగు, తాగు నీటిస్తున్న ఎదురు చూస్తున్న గండమల్ల ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. 20 ఏళ్లుగా ఏ ఎన్నికలొచ్చినా ఏ పార్టీ అయినా మొట్ట మొదటగా ఆలేరు ప్రజలకు నాయకులు హామీ ఇచ్చేది గండమల్ల ప్రాజెక్టుపైనే. గండమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఆలేరు ప్రజల సాగు, తాగు నీటి వనరు అయిన గండమల్ల ప్రాజెక్టుకు నిధులు వెచ్చించి పూర్తి చేయాలని శాసన మండలి, శాసన సభలో నాయకులు సభా దృష్టికి తీసుకు రావడంపై ప్రజలు హర్షిస్తున్నారు. ఉభయ సభల్లో కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభా దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజులుగా గండమల్లపై చర్చ జరగడంతో సాగు నీటి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని, గండమల్ల కింది రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆలేరు, రాజాపేట, గుండాల, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోత్కూర్, తిరుమలగిరి మండలాల్లోని రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉండి వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఇటీవల గోదావరి జలాలతో గండమల్ల చెరువును నింపి కింది ప్రాంతానికి నీటిని వదలడంతో ఆలేరు, గుట్ట, రాజాపేట, గుండాల, కొన్ని చెరువులను ఈ నీటితో నింపారు. గండమల్ల చెరువు నుంచి బేగంపేట, రఘునాథపురం, కొలనుపాక, ఆలేరు, గుండాల మండలాలతో అనుసంధానంగా ఉన్న వాగులో నీరు పారడంతో వాగుకు ఇవురవైపులా ఉన్న బోర్లు, బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. భూగర్భ జలాలు పెరగడంతో వర్షాలు తక్కువగా కరిసినా నీటి సమస్య లేకుండా పోయింది. అసెంబ్లీలో నాయకుల నోట గండమల్ల మాట రావడంతో గండమల్ల ప్రాజెక్టుపై ఆశలు సజీవంగా ఉన్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. గండమల్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజల కల నెరవేరనుంది



ఎన్నో ఏళ్ల పోరాటం.. ఎన్నో ఏళ్ల రైతుల సాగునీటి కల నెరవేరనున్నది. రాష్ట్రం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గండమల్ల ప్రాజెక్టుపై శాసన సభలో ప్రస్తావించి సభా దృష్టికి తేవడం హర్షనీయం. వారికి మా ఆలేరు ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు. సాగు, తాగు నీటి సమస్య గండమల్లతోనే తీరుతుంది. ఆలేరులో బీడు భూములన్నీ సస్య శ్యామలం అవుతాయి.

-వంచ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ చల్లూరు, రాజాపేట (మండలం)

చలించిన పేగు బంధం

- కిడ్నీ దెబ్బతినడంతో కుమార్తెకు ఆరోగ్యసమస్యలు
- కుమార్తెకు తండ్రి కిడ్నీ దానం



పులగం సుదర్శన్, కిడ్నీ దానం చేసిన తండ్రి (ఇన్‌సెట్లో) ఆమని, కిడ్నీ పొందిన కుమార్తె

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్యజ్యోతి): కన్న బిడ్డలు ఆపదలో ఉంటే తల్లిదండ్రుల మనస్సు వికలమైపోతుంది. బిడ్డలపై వారికి ఎనలేని మమకారం ఉంటుంది. ప్రాణాపాయంలో ఉన్న కుమార్తె కోసం ఓ తండ్రి తనకిడ్నీని దానమిచ్చాడు. తనకు వయస్సు మీద పడినా కుమార్తె భవిష్యత్ కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన పులగం సుదర్శన్. తండ్రికి పిల్లలపై ఎంత ప్రేమ ఉంటుందో చాటిచెప్పిన ఉదంతమిది. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రానికి చెందిన పులగం సుదర్శన్(58) వృత్తిరీత్యా 40ఏళ్లుగా టైలరింగ్ చేస్తుండటంతో ఆయన్ను పులగం టైలర్ అని పిలుస్తుంటారు. సుదర్శన్, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె ఆమనికి వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమని భర్త హైదరాబాద్‌లో జనరల్ స్టోర్ నడుపుతూనే, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విపరీతమైన కాళ్ల వాపులు, శ్వాస ఆడక పోవడం, దమ్ము, ఆయాసంతో ఆమని ఇబ్బంది పడింది. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా కిడ్నీ దెబ్బతిన్నదని, డయాలసిస్ తప్ప మరోమార్గం లేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో కొత్త కిడ్నీ అవసరమని, ఇందుకోసం పెద్దమొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. ఎన్నిసార్లు చికిత్స చేయించినా ఆమని సమస్య తీరకపోగా, రోజు రోజుకూ ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఈ తరుణంలో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కిడ్నీ దానం చేస్తే అమర్చుతామని, కానీ ఖచ్చితంగా సఫలం అవుతుందని చెప్పలేమని వైద్యులు తేల్చిచెప్పారు.

అయినప్పటికీ తన కుమార్తె కోసం కిడ్నీ దానం చేసేందుకు తండ్రి సుదర్శన్ ముందుకువచ్చాడు. పేగుబంధాన్ని కాపాడుకోవటానికి తన కిడ్నీ ఇస్తానని చెప్పారు. వైద్యపరీక్షల అనంతరం తండ్రి సుదర్శన్ కిడ్నీని కుమార్తె ఆమనికి సరిపోతుందని,అమర్చేందుకు వీలవుతుందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఏడాది జూలై 27 తేదీన శస్త్రచికిత్స చేసి కిడ్నీని ఆమనికి అమర్చారు.

శస్త్రచికిత్స అనంతరం మూడు నెలల తర్వాత యథావిధిగా సుదర్శన్ తన టైలరింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. శస్త్రచికిత్స పూర్తయి సుమారు ఐదు నెలలు కావస్తుండగా, ఇద్దరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నారు. తన కుమార్తెకు కిడ్నీ దానం చేసి బతికించుకున్నందుకు సుదర్శన్‌కు చెప్పలేని ఆనందం కలిగింది. కన్న కుమార్తెకు కిడ్నీ దానం చేసి సమాజంలో మానవ సంబంధాలు, ఆత్మీయత అనురాగాలకు అర్థం చెప్పిన గొప్పవ్యక్తిగా సుదర్శన్‌ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

కుమార్తె జీవితం కన్నా ఎక్కువేముంది



ఆమని కిడ్నీ సమస్యతో ఇబ్బందిపడటం బాధించింది. తండ్రిగా తట్టుకోలేకపోయా, నా కిడ్నీ సరిపోతుందని వైద్యులు తెలపడంతో ఇచ్చేందుకు సిద్ధపడ్డా. బిడ్డ ప్రాణం కన్నా నా కిడ్నీ విలువైందేమి కాదు. ఇప్పుడు ఇద్దరం సంతోషంగా ఉన్నాం. నా పనిని నేను చేసుకోగలుతున్నా.

- పులగం సుదర్శన్, తండ్రి, కిడ్నీ దాత

నా తండ్రి రుణం ఎలా తీర్చుకోవాలో



కిడ్నీ దానం చేసి తనకు పునర్జన్మని ప్రసాదించిన తండ్రి సుదర్శన్ రుణం ఎలాతీర్చుకోవాలో. తన పిల్లలు, కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని కిడ్నీ దానం చేసి దేవుడిలా రక్షించారు. ఆయన్ను దేవుడిలా ఆరాధిస్తా.

- ఆమని, కుమార్తె

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మొదటి స్థానం

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పదో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17 ఐదో జోన్‌లో మొదటిస్థానం సాధించారు. కబడ్డీ విభాగంలో బెస్ట్ రైడర్‌గా నరేందర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా చంద్రహరితేజ్ నిలిచారు. అండర్-17 అథ్లెటిక్స్ లాంగ్, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రవీణ్ గోల్డ్ మెడల్ సాధించాడు. అండర్-14 క్యారమ్ విభాగంలో నితిన్ సిల్వర్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ప్రవీణ్, నితిన్‌లు గోల్డ్‌మెడల్ సాధించి గురుకుల పాఠశాలకు గుర్తింపు తెచ్చారు.

అవార్డులు, పదవులకు వన్నె తెవాలి : ప్రజా సంఘాలు

భువనగిరి గంజ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల స్ఫూర్తితో అవార్డులు, పదవులకు వన్నె తీసుకురావాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఇటీవవల ఢిల్లీలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ జాతీయ అవార్డు పొందిన సురుపంగ శివలింగం, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనుకుంట్ల బాబురావు, పచ్చలకట్ట సోమేశ్వర ఆలయ చైర్మన్ కొల్లూరి రాజుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక జగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యోతీరావు పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ బానోత్ భాస్కర్‌నాయక్, దళిత ఐక్య వేదిక చైర్మన్ బట్టు రాంచంద్రయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ జహంగీర్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

హరితహారం పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం

భువనగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల అభ్యున్నతి, హరిత హారం కార్యక్రమ పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు కంకల సిద్ధిరాజు అన్నారు. ఆదివారం భువనగిరిలో జిల్లా స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బబ్బూరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బైరగోని రమేశ్ , కోశాధికారిగా జేరిపోతుల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, నరేందర్, భిక్షు నాయక్, నర్సింహులును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బ బ్బూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చాలిచాలని వేతనాలతో జీవితం గడుపుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఐక్యంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

(5వపేజీ తరువాయి)

సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను పునురుద్ధరించనున్నట్లు గతంలోనే బీఆర్ఎస్ ప్రకటించింది. సంస్థాగతంగా పార్టీ తరపున తీసుకునే నిర్ణయాలు, కార్యకలాపాలు కూడా జిల్లా కమిటీలకే పూర్తి బాధ్యత ఇచ్చింది. జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీలు అధిష్ఠానం సూచన మేరకు పనిచేస్తాయని, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు, ఎంపీల ఒత్తిడి, పెత్తనం ఉండదని గతంలో పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సీనియర్ నేతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జిల్లా అధ్యక్షులుగా అధిష్ఠానం ప్రకటించింది. అయితే కార్యవర్గం లేకుండానే సుమారు రెండేళ్లుగా ఏకపక్షంగా అధ్యక్షుడు, మండల కమిటీలతోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అనుబంధ కమిటీలు ప్రకటించని వైనం

బీఆర్ఎస్ 2022 జనవరి 26న జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షుల నియామకాలను సైతం చాలా కాలం వాయిదా వేసి జనవరి 26న పార్టీ అధినేత కేసీఆర్ ఎట్టకేలకు 33 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఆ తర్వాత పూర్తిస్థాయి కార్యవర్గం లేదు. పార్టీ జిల్లా అధ్యక్షులు బాధ్యతలు తీసుకున్న అనంతరం పార్టీ అధిష్ఠానంతో చర్చిస్తున్న పలు సందర్భాల్లో జిల్లా కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించాలని, లేనిపక్షంలో కనీసం పార్టీ అనుబంధ జిల్లా అధ్యక్షులను ప్రకటించాలని అధినేతను కోరారు. అయితే అధిష్ఠానం మాత్రం ఇంతకాలం జిల్లా అధ్యక్షుడితోనే నెట్టుకొని వచ్చింది. బీఆర్ఎస్‌గా అవతరించిన అనంతరం కూడా సంస్థాగత పదవులు పొందలేకపోయామని ఇంతకాలం పార్టీలో ఉన్న నేతల్లో అసంతృప్తి ఉంది. అయితే త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

- నిత్యాదాయం రూ.57.52 లక్షలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోవడంతో పాటు వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలు నిలిపారు. సుమారు 55వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలపగా ఉభయ క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ఉచిత దర్శనాలకు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల, కొండపైన కింద బస్టాండ్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వద్ద కూడా భక్తుల సందడి నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు రద్దీకి తగినట్లు బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.57,52,702ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి గాలి గోపురానికి స్వర్ణ తాపడానికి హన్మకొండకు చెందిన భక్తులు వాకా సత్యనారాయణ జయలలిత దంపతులు రూ. 5,01,116 నగదు ఈవోకు అందజేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గోదాదేవి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేపట్టగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



తూర్పు రాజగోపురం వద్ద ఉభయ క్యూలైన్లలో భక్తుల రద్దీ





నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.

రాజాపేటకు చేరుకున్న సైకిల్ యాత్ర

రాజాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందూ రాష్ట్ర సాధనకు, జ్యోతిర్లింగాల దర్శనం కోసం ఇద్దరు యువకులు సిద్దయ్యస్వామి, కతం రాజేశ్వర్ చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం రాజాపేటకు చేరుకుంది. జైశ్రీమ్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆరు నెలల క్రితం చేపట్టిన యాత్ర 10వేల కిలోమీటర్లకు చేరుకుందని స్వామి, రాజేశ్వర్లు తెలిపారు.

ఇళ్ల సర్వేకు సాంకేతిక సమస్యలు

నడిగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సాంకేతిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయని సిబ్బంది వెంకటేశ్వర్లు, అశోక్‌లు తెలిపారు. శనివారం నడిగూడెం, కరవిరాల, కాగితరామచంద్రపురం గ్రామాల్లో సర్వే నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. నడిగూడెంలో ఆన్‌లైన్ అప్‌డేట్ కానందున ఇబ్బంది పడుతున్నామన్నారు. రోజుకు 50ఇళ్ల సర్వే చేయాల్సి ఉండగా 20 నుంచి 30ఇళ్లు కూడా సర్వే చేయలేకపోతున్నామని తెలిపారు. మండల కేంద్రమైన నడిగూడెంలోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం 1180మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు 270 ఇళ్లను మాత్రమే సర్వే చేశామని తెలిపారు.

నిర్మాణం పూర్తి చేశారు.. ప్రారంభం మరిచారు

చాలీచాలని గదులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

కోదాడ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోరకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని పులిచింతల పునరావాస కేంద్రమైన నెమలిపురి కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అదనపు తరగతులు కోసం మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. రూ.కోటి వ్యయంతో అదనపు తరగతి భవనాల నిర్మాణం పూర్తయి, ఏడాది గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తొలగలేదు. ఈ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థులకు తరగతి గదులు సరిపోనందున గత ప్రభుత్వ హయాంలో ఎనిమిది గదులతో రెండతస్థుల భవనాన్ని నిర్మిం చారు. ఈ భవన నిర్మాణం పూర్తయి సంవత్సరమైనా ఇంతవరకు ప్రారంభించలేదు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదపపు తరగతి గదుల భవనాన్ని ప్రారంభించి తమ పిల్లల ఇబ్బం దులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తయిన అదనపు తరగతి గదుల భవనం

త్వరలో ప్రారంభిస్తాం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించా.అదనపు తరగతి గదుల భవనాన్ని కాంట్రాక్టర్ పూర్తి చేసి అప్పగించారు. ఎమ్మెల్యే పద్మావతి త్వరలో ప్రారంభిస్తారు.

- ఝాన్సీరాణి, ప్రిన్సిపాల్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులకు ఎరువులు సిద్ధం

కోదాడ మండల ఏవో రజని



వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కోదాడ మండల వ్యవసాయాధికారి రజని తెలిపారు. వ్యవసాయంపై 'ఆంధ్రజ్యోతి'కి ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి - కోదాడ రూరల్)

ఆంధ్రజ్యోతి: యాసంగి పంటకు రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

ఏవో: రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యూరియా 648 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 600మెట్రిక్ టన్నులు. పొటాషియం 50 మెట్రిక్ టన్నులు. డీఏపీ 440మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు మండలంలో ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారు.

ఏవో: మండలంలో 9,291మంది రైతులకు 54 కోట్ల 24 లక్షల రుపాయల రుణాలు ఉండగా, 5,182 మంది రైతులకు 29 కోట్ల 61 లక్షల రుపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది.

ఆంధ్రజ్యోతి: యాసంగిలో వరి ఎన్ని ఎకరాల్లో సాగవుతుంది?

ఏవో: వానాకాలం సీజన్‌లో మండలంలో 26,700 ఎకరాల్లో వరిని సాగు చేశారు. యాసంగిలో కూడా అదేవిధంగా సాగు చేసే అవకాశం ఉంది.

భరత నాట్యంలో చిన్నారికి నంది అవార్డు

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఏడేళ్ల చిన్నారి బుర్రి లక్ష్మీసాయి భారత నాట్యప్రదర్శనలో నంది అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతీ పరిషత్ ట్రస్ట్ భవన్‌లో ఆదర్శ కళానిలయం, శాస్త్రీయ నృత్య నిరాజనం వారు నిర్వహించిన కళా ఉత్సవాలల్లో ఆత్మకూర్(ఎస్)కు చెందిన బుర్రి క్రాంతి-మౌనిక దంపతుల కుమార్తె బుర్రి లక్ష్మీసాయికి నంది అవార్డు, మెడల్, సర్టిఫికెట్‌ను న్యూమారాలజిస్టు దేవజ్ఞశర్మ అందజేశారు.

పేటలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

భానుపురి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):సూర్యాపేటలో భానుపురి ప్రీమియర్ లీగ్ సీజన్-1 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రాంభమయ్యాయి. ఆదివారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పోటీలను మొదటి బహుమతి లక్ష రూపాయాల దాత శ్రీరామ్ సాయిరాం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతాల క్రాంతికుమార్ రెడ్డి, ఉయ్యాల ఉపేందర్, హెడ్ కానిస్టేబుల్ బోస్కు, సుధాకర్, సతీష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

యూనివర్శిటీ టాపర్ కావ్యకు అభినందనలు

మేళ్లచెర్వు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోస్టు గ్రాడ్యుయేషన్‌లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచిన రంగిశెట్టి కావ్యను మాజీ ఎంపీపీ పద్మ, మాజీ సర్పంచ్ కొట్టె సైదేశ్వరరావు అభినందనలు తెలిపారు. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన రంగిశెట్టి సైదయ్య కుమార్తె కావ్య హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, ఐసీబీయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో 2022-24లో పీజీ చేసిన కావ్య యూనివర్శిటీ టాపర్‌గా నిలిచింది. ఆదివారం హైదరాబాద్‌లోని యూనివర్శిటీ క్యాంపస్‌లో గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కావ్యకు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తా

కోదాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆదివారం కోదాడ గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్,రమణ, వెంకన్న పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

కోదాడటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఎంఈవో సలీంషరీఫ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి సురేష్ అన్నారు. కోదాడ ఇంటర్ స్కూల్ క్రికెట్ చాంపియన్షిప్ సీజన్-3 కోసం కోదాడలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోదాడ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సిద్ధిఖ్, చందా శ్రీనివాసరావు, ఖాజామియా, తుమ్మల సురేష్, జబ్బర్, బి. సైదులు, శ్రీకాంత్, బుల్లయ్య పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కాల్వ మరమ్మతులు

మఠంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములూరి ప్రాజెక్టులో బాగమైన మండలంలోని మంచ్యాతండాలో యాతవాకిళ్ల కిళ్ళ ఆయకట్టు చివరి కాల్వ నాచు. పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. దీంతో ఆయకట్టు చివరి రైతులకు నీరందక ఇబ్బందులు పడుతున్నందున, యువజన కాంగ్రెస్ నాయకుడు మాలోతు నాగనాయక్ ఆఆదివారం యువజన సంఘం సభ్యులతో కలిసి తన సొంత ఖర్చు రూ.10వేలను కాల్వను మరమ్మతు చేయించారు.

పరిశ్రమ అభివృద్ధిలో కార్మికులదే కీలకపాత్ర



ఎన్‌సీఎల్ పరిశ్రమ 41వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎండీ గౌతమ్

మఠంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పరిశ్రమ అభివృద్ధిలో కార్మికులు కీలకపాత్ర పోషించారని నాగార్జున సిమెంట్ పరిశ్రమ ఎండీ కలిదండి గౌతమ్ అన్నారు. ఆదివారం ఎన్‌సీఎల్ పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన 41వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 200టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించిన నాగార్జున పరిశ్రమను నేడు మూడు వేల మిలియన్ టన్నుల ఉత్పత్తి పెంచామని, రానున్న రోజుల్లో నాలుగో ప్లాంట్ పూర్తయితే మరో మిలియన్ ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఎన్‌సీల్ గ్రూపు ద్వారా 2500మందికి పరోక్షంగా, మరో నాలుగు వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించే కలిదండి రామచంద్రజు వైద్యశాల, పాఠశాలలకు సంవత్సరానికి రూ.3.5కోట్లు కేటాయిస్తున్నామన్నారు.. పాఠశాల, కళాశాలలో 1300 మంది విద్యార్థులు ఉండగా, పరిశ్రమ పరిధిలోని తండాలు, గ్రామాల 100మంది విద్యార్థులకు పిల్లలకు ఉచిత విద్యతో పాటు స్కూల్ సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని అన్నారు. సిమెంట్ తయారీలో వెలువడే వేడి(ఆవిరి) ద్వారా 5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలో 30ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు అవార్డులు అందజేశారు. .సీనియర్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఈడీలు సుబ్బారావు, ఉత్కల్ గోరాడియా, రూప, యూనిట్ హెడ్ చంద్రశేఖర్, రఘువర్మ,హరీష్‌రావు, కమలేష్, హేమచంద్ర, బాబు హీరాల్, ప్రెసిడెంట్ ఎస్.చక్రధర్, ప్రతినిధులు సతీష్‌కుమార్, దస్తగిరిరెడ్డి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరాజు, శ్రీనివాసచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్‌సీ ఈ సందరద్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

కళాకారుల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్ద పీట

సూర్యాపేట టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కళాకారులు అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరాల యాదగిరి, సీనియర్ కళాకారులు నకిరేకంటి చిరంజీవి, చెరుకు శైలేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను ఆదుకుంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ సంస్కృతిక సారథి చైర్మన్ గుమ్మడి వెన్నెల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కళాకారులకు అవకాశాలు లేక, ఉపాధి కరువై ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లెపాక లింగయ్య, ఆకారపు ఉపేందర్, బోయిల్ల వెంకటమ్మ, ములకలపల్లి సంతోష, ఉయ్యాల శివరామకృష్ణ, ఇరుగు వెంకన్న, గంట నాగలక్ష్మీ, జెల్ల సువర్ణ, సారగండ్ల శ్రీను, కంకనాల అంజి, కంచి సరిత, కొణిదల లింగమ్మ పాల్గొన్నారు.



సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యమ కళాకారులు

కొనసా...గుతున్న సర్వే

5వ పేజీ తరువాయి..

ఐదుగురు సర్వేయర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు.

ఇప్పటివరకు 1.23లక్షల దరఖాస్తుల సర్వే

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,09,062 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,23,531 దరఖాస్తుల సర్వేను అధికారులు, సిబ్బంది పూర్తి చేశారు. ఇది కేవలం 40శాతం మాత్రమే. ఈ సర్వేను నెలాఖరు నాటికి కచ్చితంగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ సర్వే పూర్తికావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సర్వేను వేగవంతం చేస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను వేగవంతం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. సర్వేలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా పక్కాగా నిర్వహిస్తున్నాం. అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. సొంతంగా ఇంటి స్థలం ఉండి ఇందిరమ్మ ఇంటి పథకానికి అర్హులైన వారికి ప్రభుత్వం తొలి విడతగా ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయనుంది./గ్రామదేవతల ఆశీస్సుల ఎల్లకాలం ఉండాలి.

●పి.రాంబాబు, అదనపు కలెక్టర్

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

కోదాడ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉప్పలమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోదాడకు చెందిన పలువురు ప్రముఖులు అన్నారు. ఆదివారం కోదాడలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఉప్పలమ్మ తల్లి పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ ప్రజల సంస్కృతీసంప్రదాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు తూనం కృష్ణ, సెక్రటరీ ఎలమందుల నరసయ్య, సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, సామినేని ప్రమీల, పైడిమర్రి వెంకటనారాయణ, దొంగరి శ్రీను, విలాసకవి, నరసరాజు, అల్తాఫ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కోదాడలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోదాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కోదాడ శ్రీమాతృశ్రీ విద్యానిలయం 1998-99పదో తరగతి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. అనంతరం కోదాడలోని మామిడి తోటకు వెళ్లి ఆట-పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మొదట తమతో చదువుకుని వివిధ కారణాలతో చనిపోయిన విద్యార్థుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యల్లంశెట్టి ఆనందకుమార్, కొల్లు రాజేష్, కలకొండ సైదులు, చీదెళ్ల వెంకటసాంబశివరావు, శ్రీకాంత్, శ్రీను, మధు పాల్గొన్నారు.

● తిరుమలగిరి : తిరుమలగిరిలోని నలంద విద్యాలయానికి చెందిన 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆది వారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కారుపోతుల నరేష్, తుమ్మ రమేష్, జి.నరేష్, విజయ్, శోభన్, గట్టయ్య, శ్రవణ్, సుమలత, స్వరూప, లావణ్య, మంజుల పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం మండంలోని మంగలితండాలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో చేతులకు బేడీలు వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్‌రెడ్డి, కొల్లూరి ఈదయ్యబాబు, సుమతి, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

మోడల్ కాలనీ ఆద్యుడు ఉత్తమ్

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోడల్ కాలనీ ఆద్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని టీపీసీసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎండీ అజీజ్ పాషా, కౌన్సిలర్ మంజులచౌదరి అన్నారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొని మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మంత్రి ఉత్తమ్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద 2160ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారని కొనియాడారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ పట్టణంలోని రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పాశురం పఠనం చేశారు. అంతకుముందు కుంకుమను పట్టణ వీధుల్లో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, మురళి, దోసపాటి నరసింహమూర్తి, శోభారాణి, భారతమ్మ, పద్మ, దామోదర్, మురళీమోహన్, జగన్నాథాచార్యులు, నరసింహాచార్యులు, పిచ్చమ్మ, రాజ్యలక్ష్మీ, పుష్ప పాల్గొన్నారు.

ఆలయాలో కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: మేళ్లచెర్వు మండల కేంద్రంలోని భూనీల సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, శ్రీరామమందిరాలలో ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, రంగభట్టాచార్యులు, ప్రసాద్, రాధాకృష్ణమూర్తి, భానుకిరణ్ శర్మ, ఈవో శంభిరెడి పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, మురళీధరాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని తమ్మరబండపాలెం బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు జనవరి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అర్చకుడు ముడుంబై లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

సూర్యాపేట టౌన్: పోటీల్లో క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని సామాజికవేత్త శ్రీరాం సాయిరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీకళాశాల మైదానంలో భానుపురి ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్‌పై మక్కువతో మొదటి స్థానం సాధించిన జట్టుకు సొంతంగా రూ.లక్ష బహుమతి అందజేయడానికి ముందుకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కంటి ఆసుపత్రి వైద్యుడు నాతాల క్రాంతికుమార్‌రెడ్డి, ఉయ్యాల ఉపేందర్, బొస్కు సుధాకర్, సతీష్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సూర్యాపేట టౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌజ్‌లో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఫొటోతో కూడిన టీషర్టులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామసాని రమేష్‌నాయుడు, ఇమాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ వాహనాల విడిభాగాల వేలం పాట

సూర్యాపేట క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద గల ఏఆర్ పోలీస్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పోలీస్ వాహనాల విడిభాగాల బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీస్ ఎంటీవో ఆర్ఎస్ఐ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వాహనాల పాత బ్యాటరీలు, టైర్లు ఇతర భాగాలను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని, ఈవేలంలో ప్రతి ఒక్కరూ. పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం.8712686019ను సంప్రదించాలన్నారు.

నేటి క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. .సమావేశంలో పాస్టర్లు సుధాకర్, దేవసహాయం, శ్యామూల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, దనవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

హుజూర్‌నగర్ రూరల్: అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని మాలమహానాడు జిల్లా నాయకుడు దగ్గుపాటి బాబురావు కోరారు. నాయకులు పీవీ రావు, గడ్డం వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇట్టిమళ్ల శ్రీనివాస్, బెంజిమెన్, రాములు,జ్ఞానయ్య, సావిత్రి, వినోద్, పున్నయ్య, బాబు, నరసింహారావు, అరుణ్ పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

మేళ్లచెర్వు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం, డీవైఎఫ్‌వై ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సైదులు, నర్సింహారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి

నేరేడుచర్ల: నేరేడుచర్లలోని ఎస్టీ హాస్టల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు షేక్ యూసుఫ్, కందిబండ శ్రీనివాసరావు, పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

గరిడేపల్లి: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవన్లో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నాగరాజు, రామారావు, సైదులు, అంజిబాబు, శ్రీను, లకుపతి, చారి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

గరిడేపల్లి: మండలంలోని పొనుగోడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామ్ లక్ష్మమ్మ దశ దిన కర్మకు మాదిగ జేఏసీ జిల్లా కన్వీనర్ రామ్ సైదులు రూ.12 వేలు, 25 కిలోల బియ్యాన్ని ఆమె కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ మద్దిమడుగు సైదులు, రామ్ శ్రీను, నాగేంద్రబాబు, వెంకన్న, రాజు, సతీష్, చినసైదులు, అరవింద్, నాగరాజు, వెంకన్న, నరహరి, న వీన్, సందరయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్ఐకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

మఠంపల్లి: మఠంపల్లి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బి.బాబును మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ కుక్కల నాగరాజు, గడ్డం వీరయ్య, బండి వెంకటరెడ్డి, సలీం, కాసాని వెంకటాచారి, కుక్కల అంజి, గురవయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వెంకటస్వామికి నివాళి

కోదాడ రూరల్: మాజీ ఎంపీ వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం కోదాడలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా రాష్ట్రాభివృద్ధికి వెంకటస్వామి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంచందర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్, సూరయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ యువతకు ఆదర్శం

చిలుకూరు: సాంఘిక విప్లవకారుడు పెరియార్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా భాస్కర్ అన్నారు. మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిలుకూరులో పేరియార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మానవ వికాస వేదిక జిల్లా అధ్యక్షుడు పుట్టపాక అంజయ్య, పీవీ దుర్గాప్రసాద్, నరసింహారావు, గుజ్జుల నరసింహారెడ్డి, కైలాసం ఏడుకొండలు, ఖన్నం సాహెబ్, దొడ్డా వెంకటయ్య, గురుప్రసాద్, వీరబాబు, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి: సీఎంఆర్ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దోనకొండ రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గోగుల ఉప్పలమ్మకు రూ.60 వేలు, డిక్కి శివచరణ్ రూ.60వేల విలువైన సీఎంఆర్ఎస్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దొనకొండ సంధ్య, విజయ్, రాములు, దశరథ, వెంకన్న, లింగయ్య, అయోధ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి

నూతన్‌కల్ యాసంగి పంటకు ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు చూడి లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టులలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికి నీటిని విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు.. ఈ సమావేశంలో కనకటి మహేష్, వీరుయాదవ్, సతీష్ పాల్గొన్నారు.